నేడు డయల్ యువర్ డీఎం

హయత్‌నగర్: హయత్‌నగర్ 1, 2 ఆర్టీసీ బస్ డిపోల పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంలు విజయ్, శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959226138, 9959226419 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ఎల్‌సీలు మంజూరు చేయటం హర్షణీయం

మన్సూరాబాద్: విద్యుత్ వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని విద్యుత్ మరమ్మతులకు ఎల్‌సీలు మంజూరుచేయటం హర్షణీయమని తెలంగాణ ఎలక్ట్రికల్ కంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ కరుణాకర్‌బాబుకు అసోసియేషన్ నేతలు శనివారం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌సీలు ఇవ్వటంలో జాప్యం జరుగుతోందన్నారు. చాలా రోజులుగా ఎల్‌సీలు పెండింగ్‌లో ఉన్నాయని, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని కాంట్రాక్టర్లందరము ఇటీవల ఎస్ఈని కలిసి సమస్యపై వివరించినట్లు తెలిపారు. అసోసియేషన్ నేతలు ప్రదీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామ రంగారెడ్డిని సత్కరించిన ఈటల

మన్సూరాబాద్: బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డికి బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలోని పార్టీ కార్యాలయంలో సామ రంగారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పలువురు కార్పొరేటర్లు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సందడి చేసిన విద్యార్థులు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

మన్సూరాబాద్: భాష్యం విద్యాసంస్థల కల్చరల్ డే వేడుకలు చింతలకుంటలోని ప్రలవిగార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భాష్యం విద్యాసంస్థల జడ్‌ఈఓ అంకమరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆలయ పవిత్రత దెబ్బతినకుండా స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం

సైదాబాద్: సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ దేవాలయం యొక్క పవిత్రత దెబ్బతినకుండా ఉండేలా స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి చేస్తామని ప్రాజెక్ట్ ఎస్‌ఈ దత్తోపంత్ తెలిపారు. శనివారం ఆయన సైదాబాద్ వద్ద నిర్మాణంలో ఉన్న స్టీల్‌బ్రిడ్జ్‌ను పరిశీలించారు. అనంతరం ఆలయ పరిరక్షణ సమితి సభ్యులతో సమావేశమయ్యారు. స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణ ప్రారంభ సమయంలోనే అధికారులు ఆలయానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్మిస్తామని హామీ ఇచ్చారని కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్ ఆయనకు వివరించారు. అయితే ఆ తరువాత అధికారుల వ్యవహార తీరు మారిందని ఆయన అన్నారు. అందుకే ఆలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భక్తులతో కలిసి పలుసార్లు నిరసనలు చేపట్టామని తెలిపారు. ఆలయం పవిత్రతకు భంగం కలిగేలా ఆలయం పై నుండి నిర్మాణం జరిపితే అడ్డుకుంటామని సహదేవ్ యాదవ్ స్పష్టం చేసారు.

రీయింబర్స్ నిధులు విడుదల చేయాలి

సైదాబాద్: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆకుల రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేసారు. శనివారం సైదాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పలు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు బిక్షపతి యాదవ్, బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

యువకుడిని చితకబాదిన పోలీసులు!



బాధితుడు ప్రకాష్

నాగోలు: ఇద్దరు పోలీసులు ఓ యువకుడిపై విచక్షణారహితంగా చితకబాదారు. ఈ సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన మేరకు.. మన్సూరాబాద్‌కు చెందిన డ్రైవర్ ఎర్ర ప్రకాష్(23) శుక్రవారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్ నుంచి కారులో వస్తున్నాడు. కామినేని చౌరస్తాలో అభినందన్ గ్రాండ్ వద్ద ఓ యువకుడు మద్యం మత్తులో హంగామా చేస్తున్నాడు. దీంతో ప్రకాష్ అతన్ని పక్కకు జరిపే ప్రయత్నం చేశాడు. ఆ తరువాత పోలీసుల వద్దకు వెళ్ళి చెప్పాడు. ప్రకాష్ చెప్పే విషయం వినిపించుకోకుండా పోలీసులు ఈ రాత్రి ఇక్కడ ఎం చేస్తున్నావ్ అంటూ విచక్షణ రహితంగా ప్రకాష్‌పై దాడి చేశారు. దీంతో బాధితుడు అకారణంగా దాడి చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు ఉన్నత అధికారులు న్యాయం చేయాలని బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి ఎల్‌బీనగర్‌లో రెండు వర్గాలు గొడవ పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి వెళ్లి ఇరు వర్గాలు అక్కడ నుండి పంపించారు. ప్రకాష్ మద్యం సేవించి ఉండడంతో అతనికి డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేసి అతనిపై పెట్టి కేసు నమోదు చేశారు. పోలీసులు ఎవరిపైనా దాడిచేయలేదన్నారు.

భార్యపై హత్యాయత్నం

చైతన్యపురి: గొడవ కారణంగా వేరుగా ఉంటున్న భార్య ఇంటికి వచ్చిన భర్త ఆమెపై కత్తితో దాడి చేసిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన మేరకు.. మేళ్లచెర్వుకు చెందిన భుక్యా శ్రీకాంత్, వసంత(28) బార్యా భర్తలు. వీరికి ఇద్దరు సంతానం. కొన్నాళ్లక్రితం బతుకు తెరువు కోసం నగరానికి వచ్చి హయత్‌నగర్‌లో ఉంటున్నారు. ఇటీవల బార్యాభర్తల మధ్య గొడవ జరగటంతో పెద్దల సలహామేరకు కొన్నాళ్లు విడిగా ఉంటున్నారు. సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలోని సోదరి ఇంటి సమీపంలో వసంత ఇల్లు తీసుకుని ఉంటోంది. ఇండ్లలో పనిచేసి జీవనం సాగిస్తుంది. శ్రీకాంత్ శనివారం సాయంత్రం వసంత ఇంటికి వచ్చి గొడవ పడ్డాడు. దీంతో కూరగాయలు కోసే కత్తితో వసంత మెడపై దాడి చేశాడు. అరుచుకుంటూ వసంత బయటకు రావటంతో శ్రీకాంత్ పరారయ్యాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ వసంతను ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



మన్సూరాబాద్ - పోచంపల్లి పాత రోడ్డు

రోడ్డు కోసం ఎదురుచూపులు !

మన్సూరాబాద్- పోచంపల్లి పాత రోడ్డును పునరుద్ధరించాలంటున్న స్థానికులు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ నుంచి పోచంపల్లి పాత రోడ్డు పునరుద్ధరణకు ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచుస్తున్నారు. రాకపోకలు మందగించడంతో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ రోడ్డు కనుమరుగైంది. అటవీశాఖ రోడ్డుకు అడ్డంగా తమ ప్రహరీని నిర్మించటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రోడ్డు పునరుద్ధరణకు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుంటున్నప్పటికి అచరణలో అవాంతరాలు ఎదురవుతున్నాయి.

- 1986–87లో ఈ రోడ్డును నిర్మించారు. ఎల్‌బీనగర్‌లోని సిరీస్ కంపెనీ నుంచి మన్సూరాబాద్, కుంట్లూర్, కుత్బుల్లాపూర్ గౌరెల్లి, పసుమాముల, తారమతిపేట, బండరావిరాల, పెద్దగూడెం, జూలూరు మీదుగా పోచంపల్లికి గతంలో నిత్యం సరీ్వసు బస్సులు నడిచేవి. ఆటోనగర్‌లో డంపింగ్‌యార్డ్ కారణంగా చెత్తను ఈ ప్రాంతంలో వేస్తుండటంతో చెత్తతో రోడ్డు నిండిపోయి రాకపోకలు మందగించాయి. ఆ తరువాత అటవీశాఖ మహావీర్ హరిణి వనస్థలి జాతీయ పార్కును ఏర్పాటు చేసి ప్రహరీల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం జాతీయ రహదారిపై పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ఈ రోడ్డును పునరుద్ధరిస్తే రాకపోకలకు సులువుగా ఉండటమే కాకుండ సుమారు 5 కిలోమీటర్ల మేర దూరం కూడ తగ్గుతుండటంతో రోడ్డును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.



చెత్తతో మూసుకపోయిన రోడ్డు



రోడ్డుకు అడ్డంగా ప్రహరీని నిర్మించిన అటవీశాఖ

ప్రజాప్రతినిధుల చొరవతో

- మన్సూరాబాద్ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చొరవతో ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు పరిశీలించి మన్సూరాబాద్ నుంచి అటవీశాఖ ప్రహరీ నిర్మించిన రోడ్డు వరకు రూ.1.90కోట్లతో రోడ్డు విస్తరణ చేపట్టి నూతన రోడ్డును నిర్మించారు. ప్రహరీని తొలగించి మహావీర్ హరిణి వనస్థలి జాతీయ పార్కులో నుంచి కిలోమీటర్ మేర రోడ్డును నిర్మిస్తే పూర్తిస్థాయిలో రాకపోకలు కొనసాగేందుకు వీలుంది.

కేంద్రప్రభుత్వ పరిశీలనలో ఉంది



మన్సూరాబాద్ టూ పోచంపల్లి పాత రోడ్డు పునరుద్ధరణ విషయం కేంద్ర అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. కేంద్రప్రభుత్వ పరిశీలనలో ఉంది. కేంద్ర అటవీశాఖ మంత్రికి సమస్యపై వివరించాను. ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పునరుద్ధరణ జరుగుతుంది.

– కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్

వరద కాలువ నిర్మాణానికి చర్యలు



అధికారులతో వరద కాలువ నిర్మాణ పనులపై చర్చిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టుకాలనీ, జగదాంబ కాలనీల మీదుగా నిర్మించే వరదనీటి కాలువ నిర్మాణానికి ఉన్న అడ్డంకులను అధిగమించి త్వరితగతిన పనులు చేపడతామని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం హైకోర్టుకాలనీలో వరద కాలువ నిర్మాణం విషయమై టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, కాలనీవాసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు వనస్థలిపురం తూర్పు కాలనీల నుంచి హైకోర్టుకాలనీ, జగదాంబ కాలనీల మీదుగా వెళ్లే వరదనీటి కాలువ అవుట్‌లెట్ నిర్మాణానికి నిధులు మంజూరు అయినా ప్రైవేటు వ్యక్తుల స్థలానికి సంబంధించి వివాదం ఉండడంతో పనులు ఆగిపోయాయని అన్నారు. అధికారులు, కాలనీ వాసులతో చర్చించి వరద కాలువ నిర్మాణానికి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పావనీ, డీఈ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఈస్టన్ కాలనీల అసోసియేషన్ అధ్యక్షుడు దీపావళి శ్రవణ్, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

నాగోలు: సాగునీరు అందక పంటలు ఎండిపోయి, దెబ్బతిని అల్లాడుతున్న రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాయబడి పాండురంగాచారి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం కొత్తపేట వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నిక నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు నాయకులు బిజీబిజీగా ఉన్నారని, రైతన్నను పట్టించుకునే నాధుడే లేడన్నారు. బోరు బావులు అడుగంటడంతో నీ రందక పంట పొలాలు ఎండుతున్నాయని, పెట్టిన పెట్టుబడి వచ్చే ఆర్థిక పరిస్థితి లేదని, రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు.

ప్రైవేట్ హాస్పిటళ్లు సేవాభావంతో పనిచేయాలి



కార్డియాక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నాగోలు: రాష్ట్రంలో వైద్య సేవలు మరింత మెరుగుపరిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం నాగోలులోని సుప్రజ హాస్పిటల్‌లో నూతనంగా అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు చేసిన కార్డియాలజి విభాగాన్ని మంత్రి సుప్రజ హాస్పిటల్ చైర్మన్ విజయ్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు సేవా భావంతో పనిచేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, డీసీపీ సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని పంచాయతీ రాజ్ టీచర్స్‌కాలనీ ఫేజ్ 3,4లో ఉన్న శ్రీగిరి శారదాకళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన శ్రీగణపతి, సరస్వతి, ధ్యానాంజనేయ స్వామి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పూజాకార్యక్రమంలో శనివారం పాల్గొని పూజలు చేశారు.

కబ్జాల గురించి కేఎల్‌ఆర్ మాట్లాడం హాస్యాస్పదం

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గురించి మాట్లాడే స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేఎల్‌ఆర్‌ది కాదని, కబ్జాల గురించి ఆయన మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. శనివారం గ్రీన్ హిల్స్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చెందిన మంత్రులే పార్టీ గేట్లు ఓపెన్ చేశామని అంటున్నారని, వాళ్లే ఇతర పార్టీ నాయకులను చేర్చుకుంటున్నారని అన్నారు. మీరు గేట్లు తెరిచినా సబితమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరేదిలేదన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నిబద్ధతతో చేసే సేవలతోనే గుర్తింపు



వెంకట నర్సింహ్మారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓ కృష్ణ తదితరులు

చంపాపేట: నిబద్ధత, నిస్వార్థంగా చేసే సేవలతోనే ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం కూడా గుర్తింపు, గౌరవం ఉంటుందని సరూర్‌నగర్ ఎంఈఓ కృష్ణ అన్నారు. శనివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట న్సింహ్మారెడ్డి పదవీ విరమణ సందర్భంగా స్థానిక పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరై ఎంఈఓ.. నర్సింహ్మారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమాదేవి, రాష్ట్ర పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ లెటర్‌ను అందజేస్తున్న మధుయాష్కిగౌడ్

లింగోజిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మంది పేదలకు వరమని, పేదల వైద్యానికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. ఎల్‌బీనగర్ జైపురి కాలనీకి చెందిన రమాదేవి అనారోగ్యంతో అసుపత్రిలో చేరడంతో శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో సహాయం కోసం మధుయాష్కిగౌడ్‌ను సంప్రదించారు. ఆయన సహకారంతో సీఎం రిలీఫ్ పండ్ ఎల్‌ఓసీ కింద రూ.1.10లక్షలు మంజూరయ్యాయి.ఆ ఎల్‌ఓసీ లెటర్‌ను శనివారం మధుయాష్కిగౌడ్ రమాదేవి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాలలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హయత్‌నగర్ మహిళ మృతి చెందింది. ఎస్ఐసైదాబాబు తెలిపిన మేరకు.. హయత్‌నగర్‌లో నివాసం ఉండే కంచనపల్లి మోహనచారి తన తల్లి రమాదేవి, చెల్లి సూరోజు గాయత్రిలతో కలిసి సూర్యాపేటకు కారులో బయలుదేరారు. మార్గమధ్యలో చిట్యాల పట్టణ శివారులోని జాతీయ రహదారిపై గల ఎక్స్ రోడ్డులో వీరు ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా నిలిచిపోయింది. దీంతో ఆ కారును ఆ పక్కనే ఉన్న రాఖీ కారు రిపేరింగ్ సెంటర్ వద్ద పెట్టి ఆర్టీసీ బస్సులో సూర్యాపేటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. బస్సులు సకాలంలో రాకపోవటంతో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు ముగ్గురూ కలిసి జాతీయ రహదారిని దాడుతున్నారు. ఈ సమయంలో నార్కట్‌పల్లి నుంచి చిట్యాల పట్టణం వైపునకు వెళుతున్న థార్ కారు డ్రైవర్ అతివేగంగా, అజ్రాగత్తగా నడుపుకుంటూ వచ్చి రోడ్డు దాడుతున్న రమాదేవి(49)ని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమాదేవిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి కుమారుడు మోహనచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యేసుక్రీస్తు ప్రేమను చాటి చెప్పాలి

రన్‌ఫర్ జీసస్ ర్యాలీలో బిషప్ తిమోతి కొల్లబత్తుల



దిల్‌సుఖ్‌నగర్‌లో రన్‌ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

మలక్‌పేట: యేసుక్రీస్తు సిలువ శ్రమల ద్వారా సర్వలోకానికి తన ప్రేమను చాటిచెప్పాడని ఈస్ట్ హైదరాబాద్ క్రిస్టియన్ అసోసియేషన్ చైర్మన్, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బిషప్ తిమోతి కొల్లబత్తుల అన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసెస్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. క్రైస్తవ సమాజం ఐక్యతను చాటుతూ యేసుక్రీస్తు చూపిన దయ, ప్రేమ, క్షమాగుణం ఇతరుల పట్ల కలిగి ఉండాలన్నారు. దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ మూసారంబాగ్ చౌరస్తా, మలక్‌పేట డీమార్ట్, అక్బర్‌బాగ్ చౌరస్తా, హోరేబు చర్చి, అస్మాన్‌ఘడ్, సైదాబాద్, సౌత్‌ఈస్ట్ డీసీపీ ఆఫీస్, చంచల్‌గూడ పెట్రోల్ పంపు, గవర్నమెంట్ ప్రెస్ మీదుగా నల్లగొండ క్రాస్‌రోడ్‌లోని ఎంబీ చర్చి వరకు కొనసాగింది. కార్యక్రమంలో కమిటీ ప్రధానకార్యదర్శి డాక్టర్ సాల్మన్‌రాజ్, కోశాధికారి శ్యామ్, కోశాధికారి కేపీ సామేల్, పాస్టర్లు రెవరెండ్ మెన్నోజోయల్, శ్రీనివాస్ రాబర్ట్, పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్రాహం మాణిక్యం పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 17, వంకాయ 18, బెండ 40, పచ్చి మిర్చి 55, కాకర 35, బీర 38, క్యాబేజీ 19, ఫ్రెంచి బీన్స్ 60, క్యారెట్ 23, దొండ 18–23, చిక్కుడు 28–60, గోకర 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలు 28, దోస 18, సొర 9, పొట్ల 15, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 40.